## రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి: ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్ రూరల్, జనవరి 21: రైతులు సకాలంలో రుణాలు చెల్లించి, సంఘ అభివృద్ధికి సహకరించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మానకొండూర్ మండలం దేవంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం, 250 టన్నుల గోదాంను ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ కనిరెడ్డి లత-ప్రభాకర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇప్పటికే రుణ మాఫీ చేశామన్నారు. ఖాతాదారులు సకాలంలో బకాయిలు చెల్లించి, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యేకు పద్మనూర్, అలితాపూర్ గ్రామాల్లో సైతం గోదాంల నిర్మాణానికి తోడ్పాటు అందించాలని ఆయా గ్రామాల సంఘ సభ్యులు, రైతులు విన్నవించగా, సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కల్లెపు రమేశ్, ఏఎంసీ చైర్మన్ మల్లి ఓదెలు, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, పాలక వర్గ సభ్యులు, సీఈవో మల్లి కార్జున్ రెడ్డి, వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, వివిధ గ్రామాల రైతులు, తదితరులు ఉన్నారు.

## పథకాలపై స్పష్టమైన విధానం తీసుకురావాలి: మేయర్

కార్పొరేషన్, జనవరి 21: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు చేసే విషయంలో ప్రజలకు స్పష్టమైన విధానం తీసుకురావాలని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ప్రభుత్వం చేపట్టిన వార్డు సభల కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని 8వ డివిజన్‌లో నిర్వహించిన సభలో మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బంది వాతావరణం లేకుండా సమస్యలు తొలగించి సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఐలేందర్, నగరపాలక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు

కార్పొరేషన్, జనవరి 21: నగర ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ఫిల్టర్‌బెడ్ కేంద్రంలో ప్రత్యేక చర్యలు చేపట్టామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. మంగళవారం నగరంలోని మానేరు డ్యాం సమీపంలో గల ఫిల్టర్‌బెడ్ కేంద్రంలో రూ.1.10 కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన 350 హెచ్‌పీ అదనపు మోటారు పంపు, ప్యానల్ బోర్డు, 500 మెగావాట్ల జనరేటర్‌ను ప్రారంభించారు. అనంతరం నగరంలోని కోర్టు రిజర్వాయర్‌లో రూ.70 లక్షల నిధులతో నిర్మాణం చేసిన ఏతు ప్రహరీ, పెద్దను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బండారి వేణు, ఐలేందర్, రాపర్తి విజయ, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

## పైరవీలకు తావిస్తే ఆందోళన తప్పదు

హుజూరాబాద్ టౌన్/రూరల్, జనవరి 21: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో లబ్ధిదారుల ఎంపికలో పైరవీలకు తావివ్వొద్దని హుజూరాబాద్ సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే కాకుండా నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మండలంలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు 10శాతం మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. మిగిలిన 90శాతం అర్హులైన పేదలకు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. లబ్ధిదారుల ఎంపికలో పైరవీలు నడిస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సురేందర్ రెడ్డి, ఐలన్న, తిరుపతి, కిరణ్, వెంకటస్వామితో పాటు తదితరులు ఉన్నారు.

## లబ్ధిదారుల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలుపాలి

కరీంనగర్ రూరల్, జనవరి 21: ప్రజాపాలన, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక సర్వే నిర్వహించామని, ఎంపికలో అభ్యంతరాలుంటే తెలుపాలని కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ తెలిపారు. మంగళవారం కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రజాపాలన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక ప్రజామోదంతో చేస్తున్నారని చెప్పారు. ఇంకా నిరుపేదలు ఉంటే ఇప్పటికీ దరఖాస్తు చేసుకోవచ్చని స్థానికులకు సూచించారు.

## రెండో రోజు కొనసాగిన ఆర్టిజన్ల దీక్ష

ముకరంపుర, జనవరి 21: ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఈ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు జేఏసీ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం ఆర్టిజన్ కార్మికులను విద్యార్హత ఆధారంగా కన్వర్షన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ చైర్మన్ శివకృష్ణ, కన్వీనర్ జీవన్, అమానుల్లా, శ్రీనివాస్ నాయక్, చందర్ సింగ్ ఠాకూర్, పరశురామ్, సంతోష్, మద్దెల శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

## ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు 25 ఆఖరు

కమాన్‌చౌరస్తా, జనవరి 21 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంతీయ సమన్వయ కేంద్రం ఎస్ఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల ట్యూషన్ ఫీజు ఈనెల 25వ తేదీలోగా చెల్లించాలని ప్రాంతీయ సమన్వయ అభ్యాసకుల సహాయ కేంద్రం అధికారి డాక్టర్ వంగల శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ కె. రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరీంనగర్లో డిగ్రీ, (బీఏ, బీకామ్, బీఎస్సీ), పీజీ ద్వితీయ సంవత్సరం 2024-25 విద్యా సంవత్సరం అడ్మిషన్లు ఇప్పటికే అడ్మిషన్ పొందిన వారు ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www braou.ac.in, www braou.online.in చూడవచ్చని చెప్పారు.

## జాతీయ సాహిత్య పురస్కారానికి కవి గంప ఉమాపతి ఎంపిక

కమాన్‌చౌరస్తా, జనవరి 21 : జిల్లా కేంద్రంలోని గాయత్రినగర్‌కు చెందిన ప్రముఖ కవి గంప ఉమాపతి గిడుగు రామ్మూర్తి పంతులు స్మారక జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో ఈ స్మారక జాతీయ పురస్కారాన్ని కవి ఉమాపతికి ఫౌండేషన్ నిర్వాహకులు అందజేయనున్నారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

కమాన్‌చౌరస్తా/మానకొండూర్ రూరల్, జనవరి 21 : తెలంగాణ రాష్ట్రస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభాపాటవ పరీక్ష మంగళవారం హైదరాబాద్ హయత్ నగర్ ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఇందులో కరీంనగర్ జిల్లా మానకొండూర్ మోడల్ స్కూల్ విద్యార్థిని రిషిక మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేశ్ అభినందించి, ప్రశంసా పత్రం, మెమోంటో అందజేశారు. ఇక్కడ కరీంనగర్ జిల్లా సాంఘిక శాస్త్ర ఫోరం అధ్యక్షుడు బీ తిరుపతి, ప్రధాన కార్యదర్శి ఏ కుమారస్వామి, కోశాధికారి పుల్లూరి రవీందర్ పాల్గొన్నారు.

## రహదారి భద్రతపై అవగాహన

చొప్పదండి, జనవరి 21: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో చొప్పదండి పట్టణంలోని నవోదయ విద్యాలయంలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ పడాల రాహుల్ హాజరై మాట్లాడారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఎంవీఐ రవి కుమార్, ఏఎంవీఐ హరిత, రిటైర్డ్ డీటీవో జైపాల్, అధికారులు, వాహనదారులు పాల్గొన్నారు.

**చిట్ ఆక్షన్స్ (AUCTIONS) మార్గదర్శిని**

మా గౌరవ చిట్ సభ్యులకు తెలియజేయునది ఏమనగా తేది:26-1-2025 రోజున నిర్వహించే చిట్టి ఆక్షన్స్ రిపబ్లిక్ డే సందర్భముగా తేది: 31-1-2025 రోజున అదే సమయానికి నిర్వహించబడును. మా సభ్యులందరూ మాతో సహకరించగలరని మనవి.

**శ్రీవత్స చిట్‌ఫండ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్**
ఇ.నెం. 3-1-100F, బల్మూరి టవర్స్, 5వ అంతస్తు
వావిలాలపల్లి, కరీంనగర్. సెల్ : 8179981961



హుజూరాబాద్ రూరల్: కందుగులలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



గంగాధరలో గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు



చిగురుమామిడిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

# గ్రామసభల్లో గందరగోళం

**పథకాలకు లబ్ధిదారుల ఎంపికపై విమర్శలు • పలుచోట్ల అధికారులను నిలదీసిన అధికారులు**



నగరంలోని 3వ డివిజన్ వార్డు సభలో పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చిన ప్రజలు

*రాష్ట్రం ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలు గందరగోళంగా సాగాయి. జాబితాల్లో అనర్హుల పేర్లు రావడం.. అర్హులను విస్మరించడంపై పలుచోట్ల గ్రామస్తులు అధికారులను నిలదీశారు. వారు సర్దిచెప్పి మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించగా, బారులు తీరారు.*

కార్పొరేషన్, జనవరి 21: రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల అమలు కోసం చేపట్టిన వార్డు సభలు మంగళవారం నగరపాలక సంస్థలోని 30 డివిజన్లలో కొనసాగాయి. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు 15 డివిజన్లల్లో, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు మరో 15 డివిజన్లలో అధికారులు వార్డు సభలను కొనసాగించారు. కాగా, అన్ని డివిజన్లల్లోనూ రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. 3వ డివిజన్‌లో జరిగిన వార్డు సభలో కొందరు.. ఇటీవల జరిగిన సర్వేలో తమ పేర్లు ఎంపిక అయ్యాయా? లేదా? అని ప్రశ్నించగా, జాబితా త్వరలోనే వస్తుందని అధికారులు చెప్పడం గమనార్హం. పలు వార్డు సభలను నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పరిశీలించారు. మిగిలిన ప్రాంతాల్లో ఆయా డివిజన్లలో కార్పొరేటర్లు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

***వార్డు సభల్లో మొదటిరోజు భారీగా దరఖాస్తులు***

కరీంనగర్ నగర పాలక సంస్థలో మొదటి రోజు నగర వ్యాప్తంగా 30 డివిజన్లలో సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయి. రేషన్ కార్డులకు 9699, ఇందిరమ్మ ఇండ్ల కోసం 4412 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

కరీంనగర్ రూరల్, జనవరి 21: ఇంటి జాగ లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని నగునూర్ గ్రామంలోని నిరుపేద మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. స్థలం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామనడమేమిటని ప్రజాపాలనలో ప్రశ్నించారు. అసలు ఇంటి స్థలం ఉంటే, నిరుపేదలు ఎలా అవుతారని నిలదీశారు. అద్దె ఇళ్లల్లో జీవిస్తున్న తమను ప్రభుత్వం చిన్న చూపు చూస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇంటి స్థలం ఇచ్చి, మొదటి విడుతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల జాబితా వివరాలను అధికారులు వెల్లడిస్తుండగా, అనర్హులతో రూపొందించిన లిస్టును చించివేయండంటూ స్థానికులు మండిపడ్డారు. లబ్ధిదారుల జాబితా నోటీస్ బోర్డుపైన ప్రకటించాలని సూచించారు. ఎంపీడీవో సంజీవరావు కల్పించుకుని అసలు జాబితా పూర్తి కాలేదని, ప్రజాభిప్రాయం తీసుకున్న తర్వాతే జాబితాను విడుదల చేస్తామని ప్రకటించారు. అయితే, అసలు జాబితా ప్రకటించకుండా నామమాత్రంగా జాబితాతో గ్రామ సభ ఎలా నిర్వహిస్తారని అధికారులను నిలదీశారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక సర్వేలో చాలా పొరపాట్లు ఉన్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు.

హుజూరాబాద్, జనవరి 21: మండలంలోని పెద్ద పాపయ్యపల్లి గ్రామంలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం నిర్వహించిన గ్రామసభ వెలవెలబోయింది. ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల లబ్ధిదారుల జాబితా చదువుతుండగానే గ్రామస్తులు సభ నుంచి వెళ్లిపోయారు. అధికారులు వారించినా గ్రామస్తులు కుర్చీల్లో కూర్చోలేదు. దాదాపు సగానికన్నా ఎక్కువగా గ్రామస్తులు సభ నుంచి మధ్యలోనే నిష్క్రమించారు.

హుజూరాబాద్ టౌన్, జనవరి 21: పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించిన వార్డు సభలు గందరగోళంగా మారాయి. ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల లిస్టుల్లో అవకతవకలు జరిగాయని అధికారులను నిలదీశారు. పలు వార్డుల్లో సరిపడా స్టేషనరీ సామాను లేదని, అప్లికేషన్లు పెట్టుకునేందుకు కనీసం తెల్ల పేపర్లు సైతం లేవని వాపోతున్నారు. తూతూమంత్రంగా కొద్ది సంఖ్యలోనే అప్లికేషన్లు పెట్టుకునేందుకు తెల్ల పేపర్లు అందుబాటులో ఉంచారన్నారు. పట్టణంలోని ఇందిరానగర్‌లో ఇందిరమ్మ ఇండ్లు అనర్హులకే ఇచ్చారని వార్డు ప్రజలతో పాటు కాంగ్రెస్ నాయకులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ప్రజలను సముదాయించారు. అయినా.. ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన వారి లిస్టును రద్దు చేసే వరకు కొత్త అప్లికేషన్లు పెట్టుకోబోమని తేల్చిచెప్పడంతో అధికారులు చేసేదేంలేక అక్కడి నుంచి వెళ్లిపోయారు.

హుజూరాబాద్ రూరల్, జనవరి 21: హుజూరాబాద్ మండలంలో కందుగుల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల విషయంలో నియోజకవర్గంలో 3500 ఇండ్లు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పగా, మీరు మాత్రం తమ గ్రామానికి 480 మందిని మాత్రమే ఎలా ఎంపిక చేస్తారని ఎంపీడీవో సునీతను గ్రామస్తులు నిలదీశారు. చెల్పూర్‌లో పెన్షన్, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని గ్రామస్తులు ఆర్డీవో రమేశ్, తహసీల్దార్ కనకయ్యతో వాగ్వాదానికి దిగారు. సింగాపూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక జాబితాలో అర్హుల పేర్లు లేవంటూ మహిళలు ఒక్కసారిగా అధికారులపై విరుచుకుపడ్డారు. ప్రతి సంక్షేమ పథకం విషయంలో అవకతవకలపై గ్రామస్తులు నిలదీయడంతో అధికారులు తలలు పట్టుకున్నారు. పోలీసుల పహారాలో నామ మాత్రంగా సభలు నిర్వహించి చేతులు దులుపుకొని వెళ్లిపోయారు.

జమ్మికుంట, జనవరి 21: పట్టణంలో 30 వార్డులు ఉండగా, మంగళవారం మొదటి రోజు 16 వార్డుల్లో ప్రజాపాలన వార్డు సభలు నిర్వహించారు. ఆయా వార్డు సభల్లో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కమిషనర్ ఎండీ ఆయాజ్, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, వార్డు కౌన్సిలర్లు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు. మండలంలో 20 గ్రామాలు ఉండగా, మొదటి రోజు 6 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. అధికారులు పాల్గొన్నారు.

సైదాపూర్, జనవరి 21: మండలంలోని దుద్దనపల్లి, ఎలబోతారంతో పాటు వివిధ గ్రామాల్లో పథకాల లబ్ధిదారుల ఎంపికపై అధికారులను గ్రామస్తులు నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా భూమి లేని పేదవాళ్లకు ఇస్తామని చెప్పి మరలా ఉపాధిహామీ పనితో లింకు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఉపాధిపనితో పాటు వ్యవసాయకూలీలు, వివిధ కుల వృత్తులు చేసుకునే పేదలందరికీ ఎందుకివ్వరని ప్రశ్నించారు. రైతుభరోసాలో తీసివేసిన భూమిపై వ్యతిరేకత వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండాలనే లిస్టులు తయారు చేశారని, మరలా సర్వేచేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రేషన్‌కార్డుల ఎంపికపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లను అర్హులకు అందించాలని కోరారు. కాగా, అధికారులు ప్రజలతో మాట్లాడారు. లిస్టుల్లో పేర్లు లేని వారు మరలా దరఖాస్తు చేసుకుంటే రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని తెలిపారు.

ఇల్లందకుంట, జనవరి 21: మండలంలోని బుజూనూర్, పాతర్లపల్లి, బోగంపాడు, కనగర్తి, లక్ష్మాజీపల్లి, చిన్న కోమటిపల్లి, టేకుర్తి గ్రామాల్లో ప్రజాపాలనలో భాగంగా అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. బుజూనూర్ గ్రామంలో అధికారులు పథకాలకు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా చదువుతుండగా, గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని నిలదీశారు. ఎంపీడీవో పుల్లయ్య కలుగజేసుకొని జాబితాల్లో పేర్లు రాని వారు ఇప్పుడు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని చెప్పడంతో గ్రామస్తులు శాంతించారు.

వీణవంక, జనవరి 21: రెడ్డిపల్లిలో, రామకృష్ణాపూర్ గ్రామసభల్లో ఎంపిక జాబితాలో అవకతవకలు జరిగాయంటూ మహిళలు అధికారులను నిలదీశారు. వాగ్వాదానికి దిగారు. రామకృష్ణాపూర్‌లో ప్రతి ఇంటికి రేషన్‌కార్డు ఎందుకు రాలేదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజయ్య అధికారులను నిలదీశారు. ఓ లబ్ధిదారుడు దరఖాస్తు ఇవ్వడానికి అధికారుల దగ్గరికి వెళ్తుండగా, అక్కడే ఉన్న కానిస్టేబుల్ వెనక్కి తోసివేసి అత్యుత్సాహాన్ని ప్రదర్శించాడు. మొదటి రోజు గ్రామసభలు ఏర్పాటు చేసిన ప్రతి చోట లబ్ధిదారులు ప్రశ్నలతో అధికారులను నిలదీశారు.

మానకొండూర్ రూరల్, జనవరి 21: మండలంలోని లింగాపూర్, వేగురుపల్లి, అన్నారం, దేవంపల్లి, కేల్లేడు, మద్దికుంట, చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. అధికారులు అర్హుల జాబితాను చదివి వినిపించారు. కాగా, లిస్టుల్లో అర్హులు కాని వారి పేర్లు ఎలా చేర్చారని వివిధ గ్రామాల్లో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. అర్హుల పేర్లను కూడా నమోదు చేసుకుంటామని, ఇదే ఫైనల్ లిస్టు కాదని అధికారులు సర్దిచెప్పారు. వేగురుపల్లి గ్రామ సభ రసాభాసగా మారింది. ఎంపీడీవో వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించగా, పథకాల లబ్ధిదారుల జాబితాలో అనర్హులను చేర్చారంటూ గ్రామస్తులు ఆందోళన చేశారు. పేదలను విస్మరించి భూములు ఉన్న వారికి పథకాలు ఎలా వర్తింపజేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన ఓ లీడర్ చెప్పినట్లుగా అధికారులు లిస్ట్‌ను తయారు చేశారని మండిపడ్డారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయితే బాజాప్తా కాంగ్రెస్‌కు ఓటేసిన వారికే పథకాలు వర్తింపజేస్తామంటూ ఓ కాంగ్రెస్ నాయకుడు గ్రామస్తుల ముందు అనడం పెద్ద దుమారమే రేపింది. మరింత ఉద్రిక్తతకు దారితీసింది. అయితే జాబితాను రద్దు చేసి, గ్రామంలో మరోసారి సర్వే చేపడతామని అధికారులు చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

తిమ్మాపూర్ రూరల్, జనవరి 21: మండలంలోని నల్లగొండలో లబ్ధిదారుల ఎంపిక సరిగా లేదని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మార్క హరికృష్ణ గౌడ్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్ నిరసన వ్యక్తం చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ భరోసా పథకం వర్తింపజేయాలని తహసీల్దార్ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రామకృష్ణ కాలనీలో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీశ్వరాచారి పథకాల అమలుపై ప్రశ్నించగా, కాంగ్రెస్ నాయకులు ఆయనతో వాగ్వాదానికి దిగడంతో గ్రామస్తులు కూడా కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది, దీంతో అధికారులు జోక్యం చేసుకొని సభ నిర్వహించారు.

చిగురుమామిడి, జనవరి 21: మండలంలోని చిగురుమామిడి, ఇందుర్తి, సుందరగిరి, రేకొండ గ్రామాల్లోని రైతు వేదికలు, గ్రామపంచాయతీల వద్ద మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభల్లో అనర్హులను ఎంపిక చేశారని అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం చేశారు. రేషన్ కార్డులు అర్హులకు రాలేదని, రిటైర్ ఉద్యోగులకు వచ్చాయంటూ నిలదీశారు. పలు గ్రామ సభలో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. అర్హులైన వారందరి నుంచి దరఖాస్తులు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

గన్నేరువరం, జనవరి 21: మండలంలోని మైలారం గ్రామసభలో లబ్ధిదారుల ఎంపిక సరిగా లేదంటూ గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. చాకలివాని పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో అర్హుల పేర్లు లేవని బీఆర్ఎస్ నాయకులు అధికారులను ప్రశ్నించగా, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కాసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. చొక్కారావుపల్లిలో గ్రామసభలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతుండగా, మహిళలు రుణమాఫీ ఎప్పుడు అవుతుందని ప్రశ్నించారు. త్వరలోనే చేస్తామని, దాటవేసి సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చొప్పదండి, జనవరి 21: మండలంలోని వెదురుగట్ట గ్రామసభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో గుంట భూమి లేని తమను విస్మరించి, భూమి ఉన్నవారిని ఎంపిక చేశారంటూ పలువురు అధికారులను ప్రశ్నించారు. గ్రామంలో ఎలాంటి సర్వే చేయకుండా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు ఇష్టానుసారంగా వారికి కావాల్సిన వారినే ఎంపిక చేశారని ఆందోళన చేశారు. గ్రామాల్లో ఇప్పటి వరకు ఇంకా కొంతమందికి రైతులకు రుణమాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎలాంటి అవగాహన లేకుండా గ్రామ సభలకు రావడమే కాకుండా, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు సంబంధించి ప్రజలకు నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారని ఆరోపించారు.

గంగాధర, జనవరి 21: మండలంలోని గంగాధర, మధురానగర్, బూరుగుపల్లి, లింగంపల్లి, చెర్లపల్లి(ఆర్), కొండాయపల్లి, ముప్పిడినర్సయ్యపల్లి, నర్సింహుపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలు రసాభాసగా మారాయి. సంక్షేమ పథకాలను అధికారుల నిర్లక్ష్యంతో అనర్హుల పాలవుతున్నాయని గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. సర్వే సమయంలో అధికారులు నిర్లక్ష్యం వ్యవహరించడంతోనే అర్హులకు అన్యాయం జరుగుతోందని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామసభలో ప్రశ్నించిన వారిని పోలీసులు సభ నుంచి పక్కకు తీసుకువెళ్లారు. అధికారుల తప్పులను ఎత్తి చూపుతున్న తమను పోలీసులతో బెదిరింపులకు గురి చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు.

### రైతు భరోసా జాబితా తప్పల తడక



రైతు భరోసా లబ్ధిదారుల ఎంపిక జాబితా తప్పల తడకగా మారింది. అధికారులు భూములు అమ్ముకున్నవారి పేర్లు నమోదు చేశారు. గ్రామంలో సాగుకు యోగ్యం కాని భూములు చాలా ఉన్నా అధికారులు సక్రమంగా సర్వే నిర్వహించలేదు. రైతు భరోసాలో రైతులకు అన్యాయం జరుగుతున్నది. సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా ఇస్తామని, సాగుకు పనికి రాని భూములు కూడా నమోదు చేశారు. రైతు భరోసా పెద్ద బోగస్‌గా సర్వే చేశారు.

*మహేందర్ (నగునూర్, కరీంనగర్)*

### జానెడు భూమి కూడా లేదు



నేను కూలి పని చేసుకుని బతుకుతున్న. నాకు జానెడు భూమి కూడా లేదు. కరువు పనికి పోతున్న. మాలాంటి నిరుపేదలకు సర్కారు రూ.12 వేలు ఇత్తుందని తెలిసి సంబురపడ్డ. ఇయ్యాళ గ్రామ పంచాయతీ దగ్గర పైసలు అచ్చెటోళ్ల పేర్లు చదువుతరని చెప్పితె పోయిన. నా పేరు రాలేదని సార్లు చెప్పిన్రు. నా పేరెందుకు రాలేదని సార్లను అడిగితే సమాధానం చెప్పుతలేరు. పేరు రాకుంటే మళ్ల దరఖాస్తు చేసుకోవాలని చెప్పిన్రు. ఇంటికచ్చి ఫోటువలు తీసుకుని, నాకు అత్తయని చెప్పిన సార్లు ఇప్పుడు రాలేదని చెబుతున్నరు. పెద్దసార్లు మళ్ల సర్వే చేయించి మా అసోంటోళ్లకు న్యాయం చేయాలె.

*- ప్యాట దుర్గయ్య, గంగాధర*

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జనవరి 21: కరీంనగర్ మండలంలోని ముగ్ధుంపూర్ 33/11కేవీ సబ్ స్టేషన్‌లో లైన్ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముగ్ధుంపూర్, ఇరుకుల్ల, నల్లగుంటపల్లె, నారాయణ్ రావుపల్లె, మందులపల్లె, చేగుర్తి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని కరీంనగర్ రూరల్ ఏడీఈ జీ రఘు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## చిట్‌ఫండ్ చైర్మన్ అరెస్టు

సైదాపూర్, జనవరి 21: అక్షర చిట్‌ఫండ్ చైర్మన్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన ఊసగోయిల వెంకటపతి అనే వ్యక్తి హుజూరాబాద్ అక్షర చిట్‌ఫండ్‌లో 10లక్షల రూపాయల చిట్టి కట్టాడు. కాలపరిమితి దాటినా చిట్టి ఇవ్వకపోవడంతో ఆయన సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి అక్షర చిట్‌ఫండ్ చైర్మన్ పేరాల శ్రీనివాస్‌రావును అరెస్టు చేసి హుజూరాబాద్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుచగా రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

## మైనార్టీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కలెక్టరేట్, జనవరి 21 : జిల్లాలోని మైనార్టీ నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు జిల్లా మైనార్టీస్ సంక్షేమ శాఖ అధికారి పి.పవన్‌కుమార్ తెలిపారు. తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, మైనార్టీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణలో అకౌంట్ అసిస్టెంట్ యూజింగ్ టాలీ, హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్ కోర్సులు ఉన్నట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు, ఏడాదికి గ్రామీణప్రాంతాల్లోని వారైతే రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లోని వారైతే రూ.2లక్షల్లోపు వార్షికాదాయం కలిగి ఉండి, ఇంటర్, ఆపై చదివిన నిరుద్యోగ మైనార్టీ అభ్యర్థులు అనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను కలెక్టరేట్‌లో గల మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని, పూర్తి వివరాల కోసం 0878-2957085 నంబర్‌లో సంప్రదించాలని స్పష్టం చేశారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నర్సింగం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రవిశంకర్

గంగాధర, జనవరి 21: మండలంలోని కాసారం తాజా మాజీ సర్పంచ్ వేముల దామోదర్ తండ్రి నర్సింగం మంగళవారం మృతి చెందగా, భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ దామోదర్‌ను పరామర్శించారు. ఇక్కడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, నాయకులు ఆకుల మధుసూదన్, దూలం శంకర్‌గౌడ్, రామిడి సురేందర్, ఎండీ నజీర్, గడ్డం స్వామి తదితరులు ఉన్నారు.

## అగ్ని ప్రమాదంలో పత్తి పంట దగ్ధం

చొప్పదండి, జనవరి 21: పట్టణంలోని రైతు బండారి బీరయ్యకు చెందిన పత్తి పంట దాదాపు 30క్వింటాళ్లు అగ్నికి ఆహుతి అయింది. బీరయ్య కథనం ప్రకారం.. చొప్పదండి వ్యవసాయ మార్కెట్ ఆర్నకొండ రోడ్డులో గల రేగుల షెడ్డు కిరాయికి తీసుకొని పత్తి పంట ఉంచారు. మంగళవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించి సుమారు 30 క్వింటాళ్ల పత్తి పంట దగ్ధం అయిందని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


## పథకాలకు నిరుపేదలనే ఎంపిక చేయాలి

హుజూరాబాద్ రూరల్, జనవరి 21: మండలంలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని చెల్పూర్ గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్, చెల్పూర్ స్పెషల్ ఆఫీసర్ కనకయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల సాయిబాబా, రేవంత్, ప్రవీణ్ రెడ్డి, ప్రశాంత్, లక్ష్మి, కొంకటి రమేశ్, లావణ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ఎన్నికల హామీ అమలు చేయాలి

తెలంగాణచౌక్, జనవరి 21: తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను ప్రెస్ భవన్‌లో మంగళవారం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటికిరెడ్డి బుచ్చన్న యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కడారి అయిలన్న కురుమ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సందవేని గీతాంజలి యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఒకేసారి అన్ని గ్రామ సొసైటీల్లో ఎన్నికలు జరిపించాలన్నారు. జిల్లా, రాష్ట్ర చైర్మన్ పదవులు భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కురుమ యాదవులకు గొర్రెలు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 80 శాతం సబ్సిడీతో గొర్రెలు మేకలు అందించాలన్నారు, 50 సంవత్సరాలు నిండిన ప్రతి గొల్ల కురుమలకు నెలకు రూ.6 వేల పెన్షన్ అందించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు గొల్ల కురుమలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్ యాదవ్ ప్రసాద్ యాదవ్ జంగ కొమురయ్య యాదవ్, అయిలయ్య యాదవ్, బండి మల్లన్న యాదవ్, ఆవుల మల్లేశ్‌యాదవ్, జంగ తిరుపతి యాదవ్, నన్నవేని కొమురయ్య యాదవ్, బండ అనిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా లబ్ధిదారుల ఎంపిక జరుగాలి



దరఖాస్తు తీసుకుంటున్న మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక

హుజూరాబాద్ టౌన్, జనవరి 21: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో నిర్వహించిన వార్డు సభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు, వార్డు అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

గన్నేరువరం, జనవరి 21: మండలంలోని కూనవాని పల్లె వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంలో యువతికి గాయాలయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన ఎర్రవెల్లి పరశురాం తన కూతురు ప్రసన్నతో కలిసి ద్విచక్ర వాహనంపై మాదాపూర్ గ్రామానికి వచ్చి తిరిగి వెళ్తుండగా, ద్విచక్ర వాహన వెనుక టైర్ వద్ద చైన్‌లో చున్నీ ఇరుక్కుపోవడంతో ఆమె కిందపడిపోయింది. అటు నుంచి వెళ్తున్న సాయి ప్రేమ్ అనే కానిస్టేబుల్ గమనించి, వెంటనే పెట్రోలింగ్ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ రెడ్డి, కానిస్టేబుల్ సాయి అరవింద్‌కు సమాచారం అందించారు. వారు పోలీసు వాహనంలో అక్కడికి చేరుకొని, వెంటనే యువతిని మండల కేంద్రం గన్నేరువరంలోని ఒక హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స చేయించిన అనంతరం వారిని స్వగ్రామానికి పంపించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారిని తిమ్మాపూర్ సర్కిల్ సీఐ కర్రె స్వామి, ఎస్ఐ తాండ్ర నరేశ్ అభినందించారు.